**జరిగిన కథ :** కారణజన్ముడై పుట్టినవాడు శ్రీదర్శనుడు. దురదృష్టవశాత్తూ జూదరి అయ్యాడు. ఆస్తి మొత్తం కోల్పోయాడు. చివరికి ముఖరకుడనే స్నేహితుడి సాయంతో వ్యసనం వదులుకున్నాడు. శ్రీదర్శనుడు, ముఖరకుడు, అతడి చెల్లెలైన పద్మిష్ట కలిసి మాళవ దేశం చేరుకున్నారు. మాళవరాజు క్షయరోగాన్ని పోగొట్టేందుకు శ్రీదర్శనుడు భేతాళ వశ్యం చేశాడు.







# విగ్రహం చేసిన పెళ్లి

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

శ్రీసేన మహారాజుకు క్షయరోగం నయమైపోయింది. కానీ అప్పటికే ఆయన వృద్ధుడు. జబ్బు చేయడం వల్ల ఆయనలో వైరాగ్యభావం అంకురించింది. తన జబ్బు నయం కావడానికి సాయపడిన వారికి ముందుగా అర్ధరాజ్యమిస్తానని ప్రకటించినవాడు కాస్తా.. శ్రీదర్శనుడి ముఖం చూసేసరికి తన రాజ్యం మొత్తాన్ని అతనికే సమర్పించాడు. తాను వానప్రస్థానానికి వెళ్లిపోయాడు.

శ్రీదర్శనుడు రాజైన తరువాత, పద్మిష్టను వివాహం చేసుకున్నాడు. ముఖరకుడు ప్రధానమంత్రి అయ్యాడు. వారు ప్రజారంజకంగా పాలన సాగిస్తుండగా..
ఒక వింత జరిగింది.

మాళవదేశానికి చెందిన శోభావతీ నగరంలో ఉపేంద్రశక్తి అనే పేరుగల రత్న వర్తకుడు ఒకడు ఉండేవాడు. అతడొకసారి ద్వీపాంతరాలలో వర్తకం చేసి.. చాలా ధనం సంపాదించుకుని ఇంటికి తిరిగివస్తున్నాడు. ఓడ నడిపేందుకు అనువైన గాలికోసం ఎదురుచూస్తూ ఒక చోట రెండు రోజులు ఆగాల్సి వచ్చింది. ఆ సమయంలో అతని దగ్గరికి కొందరు దొంగలు వచ్చారు.

వారివద్ద ఒక మరకత మణిఫలకం ఉంది. ఆ ఫలకంపై ఒక సుందరమైన అమ్మవారి బొమ్మ చెక్కి ఉంది. ఆ విగ్రహంలో అదేం మాయో కానీ.. ఒకవైపు నుంచి చూస్తే లక్ష్మీ స్వరూపం, మరోవైపు నుంచి చూస్తే సరస్వతి, ఇంకొకవైపు నుంచి పార్వతి కనిపిస్తుంది.

రత్నాల విలువ తెలిసిన ఉపేంద్రశక్తి ఆ విగ్రహాన్ని అరవైవేల వరహాలకు బేరమాడి కొనుక్కుని, ఓడలో ఎక్కించాడు. కొన్నిదినాలకు శోభావతికి చేరి, భార్యకు ఆ విగ్రహాన్ని చూపాడు. దానిని చూస్తూనే ఆమెలో భక్తిభావం పొంగిపొర్లింది.

''నాథా! ఈ విగ్రహం జీవకళతో తొణికిసలాడుతున్నది. నేను దీనిని పూజించుకుంటాను. నా పూజాగృహంలో ఉంచండి'' అని కోరింది.

''పిచ్చిదానా! దీనివిలువ మూడుకోట్లకు పైగా ఉంటుంది. అరవైవేల వరహాలు పోసి కొన్నాను. అంత సొమ్ము ఊరికే పోగొట్టుకోమంటావా?! మనం వర్తకులం. మన ధర్మం పాటించాలి కానీ, మూఢభక్తికి పోకూడదు'' అని భార్యతో చెప్పి, ఒకసారి విగ్రహం కేసి తదేకంగా చూశాడు.

''దీనిని ఏకమొత్తంగా ఎవడూ కొనలేడు. ముక్కలు కొట్టి అమ్మేస్తాను'' అన్నాడు.

వర్తకుని భార్య లెంపలేసుకుంటూ..

''అయ్యయ్యో! ఈ విగ్రహాన్ని చూస్తుంటే ఏదో లోకం నుంచి దిగివచ్చినట్లుంది. ఇంత చక్కని విగ్రహాన్ని పగలగొడితే కళ్లుపోతాయి'' అన్నది.

''పిచ్చినమ్మకాలు పెట్టుకోబోకు'' అంటూ భార్యను కసిరి, అప్పటికప్పుడు ఆ విగ్రహాన్ని పగలకొట్టించడానికి పనివాళ్లను పురమాయించాడు వర్తకుడు.

ఆ వచ్చిన వాళ్లకు చేతులు రాలేదు.

''అయ్యా! ఇంత చక్కటి విగ్రహాన్ని చేజేతులా పగలకొట్టలేం!'' అన్నారు వాళ్లు.

వాళ్లను పురుగుల్లా చూసి, వర్తకుడే స్వయంగా సమ్మెట పట్టుకుని వాటం చూసి కొట్టబోయాడు. విచిత్రంగా అప్పుడే అతనికి కళ్లు కనిపించడం మానేశాయి. సమ్మెట కిందపారేసి, కళ్లు నులుముకోసాగాడు.

భార్యను పిలిచి, కంట్లో నలకలు పడ్డాయేమో చూడమన్నాడు. ఆమె పరీక్షించి చూసి..

''అయ్యో! తెల్లగుడ్లు పడ్డాయి'' అన్నది భయంగా.

''ఒసేయ్.. నీది విషపునోరు. ముందుగానే కళ్లు పోతాయని శపించావు. అన్నంతపనీ జరిగింది. ఇప్పుడేం చేయమంటావో చెప్పి తగలడు'' అని విసుక్కున్నాడు వర్తకుడు బాధగా.

''అమ్మవారిని పూజించుకుంటానని, చెడు తలపెట్టనని ఒప్పుకొని, లెంపలేసుకుని మొక్కుకోండి'' అన్నది అతని భార్య.

వర్తకుడు అలాగే చేసేసరికి విచిత్రంగా మళ్లీ కళ్లు వచ్చాయి. ఆనాటినుంచి ఆ ఇల్లాలు ఆ విగ్రహాన్ని పూజించుకుంటూ వస్తున్నది. వర్తకుడు మాత్రం జరుగుతున్నదానికి మనసులో కుళ్లుకుంటూనే ఉన్నాడు. కానీ చేసేదేం లేక ఊరుకున్నాడు.

ఒకరోజున ఆ ఇల్లాలు అమ్మవారి విగ్రహానికి పూజ చేసి, నిద్రపోయింది. స్వప్నంలో అమ్మవారు కనిపించి..

''పుత్రీ! మీ ఇంట్లో నాకు పెడుతున్న నైవేద్యం చాలడం లేదు. నన్ను ఏదైనా ఆలయంలో ప్రతిష్ఠించి, నిత్యపూజలు జరిగేలా చూడు'' అని సెలవిచ్చింది.

మెలకువ వచ్చిన తరువాత ఆ విషయాన్ని ఆమె భర్తతో చెప్పింది.